# క్షా దొరికింది

శ్రీ జి. వి. రామమూర్తి

శీతాకాలం; అమావాశ్యరాత్రి. నా భార్య పుట్టింటికి వెళ్లడంవల్ల ఎన్ని గంటలకు యిల్లుచేరుకున్నా ఫరవాలేదని రాత్రి పన్నెండు గంటలవరకు నా స్నేహితుడింట్లో బాతాకానీకొడుతూ కూర్చున్నాను.

"ఇంత రాత్రప్పుడు ఎందుకంత దూరం వెళ్లడం? నీ భార్య ఊర్లో లేదాయె! ఒంటరిగా అక్కడేం పడుకుంటావు - ఇక్కడే పడుకో - ఏర్పాటుచేస్తా" నని నా స్నేహితుడు అన్నాడు, గాని యింట్లో ఎవరూలేరు గనుకనే తప్పకుండా యిల్లుచేరుకోవాలనిచెప్పి, మైలాపూర్ నుండి గాంధీనగర్లో కొత్తగా కట్టించిన మా యింటికి సైకిల్ రిక్షాలో బయలుదేరాను.

పట్నం అప్పుడే మాటుమడిగింది. అక్కడా అక్కడా ఉన్న బంక్, టీ షాపుల దగ్గర మాత్రం కొద్దిగా సందడి ఉంది. మందవల్లి దాటిన తర్వాత ఊరు విడచి యింకో ఊరు వెళుతున్నట్లనిపించింది. శీతగాలికి కొంచెం చలివేస్తూంది. అందువల్ల రిక్షావాడు సినిమాపాటలను కూనిరాగాలు తీయసాగాడు. నా బుర్రలో ఆలోచనలు బయలుదేరాయి. "ఇంతా ఇంటికి వెళ్తే పరుపైనా సిద్ధంగా వేసివుండదే - గాంధీనగర్కు చివరఉన్న అంత పెద్ద యింట్లో ఒంటరిగా పడుకోవాలి! పంపించక, పంపించక యీ రోజుల్లో ఎందుకు పంపించానా మా ఆవిడ్ని! ఈ చలిలో - యీ అర్ధరాత్రిపూట - ఎందుకీ ప్రయాణం! మైలాపూర్లో వాడింట్లో పడుకుంటే తీరిపోయేది ... ... అక్కడ మా యింట్లో ఉన్న స్వేచ్ఛ ఎలాగుంటుంది? నా యింట్లో నా యిష్టంవచ్చినంతసేపు హాయిగా మునుగుతన్ని పడుకోవచ్చు ... ..." అని యిలా ఆలోచించుకుంటూ ఉండగానే నా యింటి సమీపంలో రిక్షా ఆగింది. కొత్తగా కొళాయిలు వేస్తూ ఉండడంవల్ల, రోడ్డుకు అడ్డంగా కర్రలుకట్టి ఎర్ర దీపాలు వాటిమీద వెలుగుతున్నాయి. అందువల్ల అక్కడే రిక్షాదిగి, రిక్షావాడికి డబ్బుయిచ్చి మెల్లగా యిల్లుచేరుకున్నాను. వీధి తలుపు తాళం తీస్తూండగా, "ఎవరది?" అంటూ నన్నెవరో ప్రశ్నించారు. "ఏం?" అని నేను ఎదురుప్రశ్న వేసి, తలుపు తీసుకుని యింట్లోకిపోయాను. కార్పొరేషన్ వాచ్ మేన్ ఒకడు మా యింటి ప్రక్కనే ఒక గుడిసె వేసుకొని అందులోనే ఉంటూ, ఆ చుట్టు ప్రక్కల కాపలా కాస్తూ ఉంటాడని నాకు తెలుసు. వాడే నన్ను హెచ్చరించి ఉంటాడని అనుకుంటూ ఆ ఎదురు ప్రశ్న వేసి సమాధానంకోసం ఎదురుచూడకుండా యింట్లోకిపోయి తలుపు వేసుకున్నాను.

చీకట్లో స్విచ్ వేసి, త్రోవమానుకుని, దీపం ఆర్పి నా పడకగది చేరుకున్నాను. స్విచ్ నొక్కాను, దీపం వెలిగింది. నాకు భయం కలిగింది. నా టేబిల్ డ్రాయరు తెరచివుంది, బీరువా తీసిఉంది. గదినిండా కాగితాలూ, బట్టలు చిందర వందరగా పడి ఉన్నాయి. ముందుగా నా బీరువా వెతకనారంభించాను. పుట్టింటినుండి తిరిగివచ్చేసరికి బహుమతిగా యిద్దామని నేనుకొన్న నెక్లెస్ కనబడలేదు. కంగారుపడ్డాను. భయంవేసింది. ఏంచెయ్యడానికీ తోచలేదు. వణుకు పుట్టుకొచ్చింది "దొంగలు! దొంగలు!" అని పైకి గట్టిగా అరుద్దామనుకున్నాను. నోరు పెగల్లేదు. కొంచెం ధైర్యం తెచ్చుకుని, శక్తిని కూడగట్టుకోవాలనుకుంటూ ఉండగా నామీద ముసుగుపడింది. మరి నా నోట మాటరాలేదు. ఎవరో బలవంతంగా నా చేతినున్న రిస్టువాచీ, ఉంగరం తీసికుని పరిగెత్తిపోయారు.

అడుగుల చప్పుడు క్రమేపి సన్నగిల్లింది. నాకు కొంచెం భయంతగ్గింది. ధైర్యంచేసి "దొంగలు! దొంగలు!" అని అరుస్తూ వీధి తలుపుతీసి బయటకు వచ్చాను. పైకి బిగ్గరగా అరచానో లేక నాలోనే

అన్నానో నాకు తెలీదు. అప్పుడే ఆ సమీపానికి డ్యూటీమీద వచ్చిన ఒక పోలీస్ మేన్, నేను వీధి తలుపుతాళం తీస్తూండగా హెచ్చరించిన వాచ్ మేన్ నా దగ్గరకు పరుగెత్తుకుంటూ వచ్చారు. కనుక నేను బిగ్గరగానే అరచేనని తెలుసుకున్నాను. విషయమంతా తెలుసుకొని వాళ్ళిద్దరు యిల్లంతా పరిశోధించారు. ఎవరూ కనబడలేదు. నా వాఙ్మూలం తీసుకుని, "యిప్పుడే ఇన్స్పెక్టర్ని తీసుకువస్తా నంటూ పోలీస్ మేన్ వెళ్ళిపోయాడు.

నాకు ఇంట్లోకి వెళ్ళడానికి భయంవేసింది. పోలీస్ మన్ వెళ్ళినవైపే చూస్తూ, ఆలోచిస్తూ నిల్చున్నాను. ఆ రెండోవ్యక్తి అక్కడనుంచి వెళ్ళాలని రెండడుగులువేశాడు. "నువ్వూ వెళ్తే ఎలాగ? నాకు భయంగా ఉంది. కాస్సేపు ఉండు" అని దీనంగా అన్నాను.

"బాబూ! వీధితలుపు తాళంవేసి రండి. పోలీసు వాళ్ళు వచ్చేవరకు నా గుడిసెలో బల్లమీద కూర్చోండి." అని నాకు ధైర్యంచెబుతూ నన్ను తన గుడిసెకు ఆహ్వానించాడు. చేసేదేమీలేక "అలాగే" నంటూ వీధితలుపు తాళంవేసి వాడితో కూడ వెళ్ళాను.

"మీరు యిలా యీ బల్లమీద కూర్చోండి" అని లోపలనున్నబల్ల చూపించి మర్యాదచేశాడు.

"నువ్వూ కూర్చో" అన్నాను.

"బాబుగారు చాలా భయపడుతూన్నారు. భయపడకండి. కాస్సేపు విశ్రాంతి తీసుకోండి, నడుం వాల్చి" అని ధైర్యం చెప్పాడు.

"మరి నువ్వు?" అన్నాను.

"నాకెప్పుడూ రాత్రి డ్యూటీయే కనుక నిద్దర రాదు" అంటూ మూలనున్న బస్తామీద కూర్చున్నాడు.

"నేను రాకముందు మా యింట్లో సందడేమీ నీకు వినబడలేదా?" అని అడిగాను.

"ఏదో సందడి జరిగిందండి: మీరే లోపలున్నారనుకున్నాను. అందుకనే మీరు తలుపు తీస్తున్నప్పుడు ఎవరదని అడిగాను."

"మరి నాతో వెంటనే చెప్పలేదేం?"

"ఏమిటోనండి యీ పాడు బుర్రకి ఆ మాత్రం చెడ్డ ఆలోచన తట్టలేదండి. ... ఛ! వెధవదీపం ఆరిపోయింది, వెలిగించివస్తా. పోలీసువాళ్ళొస్తారు మీకేం భయంలేదు, యిప్పుడే దీపం వెలిగించితెస్తా" అంటూ వెళ్ళిపోయాడు.

మెల్లిగా నడుంవాల్చి నా కాళ్లు బస్తామీదకు చాచాను. ఆ బస్తాలో ఏదో కదలినట్టయింది. నాకు భయంవేసింది "వాచ్ మన్! దొంగ! దొంగ!" అని గట్టిగా అరుస్తూ గుడిసెలోనుండి బయటకు వచ్చాను. అప్పుడే వస్తూన్న పోలీస్ యిన్స్పెక్టర్, పోలీస్ మేన్ నా దగ్గరకు పరుగెత్తుకుంటూ వచ్చారు. "ఎక్కడ? ఎక్కడ?" అని నన్ను అడిగారు. వణుకుతున్న చెయ్యెత్తి మూలనున్న బస్తా చూపించాను.

"మీ అనుమానంకొద్దీ అలా అనుకుని ఉంటారు. ఆ మూల దొంగ ఎలా ఉంటాడు?" అన్నాడు ఇన్స్పెక్టర్.

"అనుమానంకాదు, నిజంగానే ఉన్నాడు ఆ బస్తాలో చూడం"డన్నాను, వణుకుతున్న కంఠంతో.

నవ్వుతూ ఇన్స్పెక్టర్ బస్తా కదిపాడు. అందులోనుంచి మూలుగు వినబడింది

"ఇందులో ఎవడో వున్నాడోయ్! బస్తా విప్పు! అంటూ పోలీస్ మన్ను ఆజ్ఞాపించాడు ఇన్స్పెక్టరు. ఆజ్ఞానుసారం బస్తామూతి విప్పాడు పోలీస్ మేన్. సగంపోయిన ప్రాణాలతో, నెత్తురు కారుతున్న గాయాలతో బస్తాలోనుంచి బయటపడ్డాడొకడు.

"ఎవరు నువ్వు?" అని అధికార స్వరంతో ప్రశ్నించాడు ఇన్స్పెక్టర్.

"నేనా ... నేనా ... వా ... చ్ ... మా ... నం ... డి" అంటూ నేలకు ఒరిగిపోయాడా నూతన వ్యక్తి.

"ఇందాక కన్పించిన వాచ్ మేన్ ఏడండీ?"అంటూ నన్నడిగేడు పోలీస్ మేన్.

"మీరు వచ్చేముందే ఆరిపోయిన దీపం వెలిగించడానికి వెళ్ళాడండి" అన్నాను నేను.

తెల్లమొహంవేసి ఇన్స్పెక్టర్ని చూశాడు పోలీస్ మేన్. వాళ్ళిద్దర్ని చూసి నేను తెల్లమొహంవేశాను. "లైట్ వెలిగించడానికి వెళ్ళిన వాచ్ మేన్ను ఎలాగైనా పట్టుకోవాలన్నారు, మెల్లిగా వాళ్ళిద్దరు "క్లూ" దొరికిందన్నట్టు.